క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నేత



ధారూరు: పార్టీలోకి ఆహ్వానిస్తున్న హన్మంత్‌రెడ్డి

ధారూరు: మండల పరిధిలోని గడ్డమీది గంగారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత ఎల్కగోరెప్ప శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జైదుపల్లి హన్మంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలే కాంగ్రెస్‌కు శ్రీరామ రక్ష

కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప



యాలాల: ఆరు గ్యారంటీ పథకాలు రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి శ్రీరామ రక్షగా నిలుస్తాయని ఆ పార్టీ యాలాల మండల బీసీ సెల్ అధ్యక్షుడు కోర్వని అమృతప్ప ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..పేద, మధ్యతరగతి, గిరిజన జాతు లకు కాంగ్రెస్ పార్టీపై ఎనలేని ప్రేమ ఉందన్నా రు. గతంలో ఆయా వర్గాల అభివృద్ధికి కాంగ్రె స్ పార్టీ ఎనలేని సేవలందించిదన్నారు. ప్రత్యే క రాష్ట్ర ఏర్పాటు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమయిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ కాపీ కొట్టి గొప్పలకు పోతుందని ఎద్దేవా చేశారు. మనోహర్‌రెడ్డికి మండలం నుంచి భారీ మెజార్టీ అందిస్తామని పేర్కొన్నారు.

ముమ్మర తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

బషీరాబాద్: ఎన్నికలు సమీస్తుండడంతో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలోని కాశీంపూర్ వద్ద చెక్‌పాయింట్ పెట్టి వచ్చిపోయే అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నారు. శనివారం గొట్టిగఖుర్దుకు చెందిన ఓ వ్యక్తి దగ్గర రూ.60 వేలు లభించగా ఆస్పత్రి కోసమని పత్రాలు చూపడంతో వదిలేసినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

అనంతగిరి: అక్రమంగా రైలులో తరలిస్తున్న మద్యం బాటిళ్లను ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టుకున్న ఘటన శనివారం ఉదయం వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. ఉదయం ప్లాట్‌ఫాంపై ఆగిన వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్‌లో ఆర్‌పీఎఫ్, ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తికి సంబంధించిన 2 బ్యాగులో ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 17 బాటిళ్లను ఉన్నట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో ఆర్‌పీఎఫ్ టీం స్వర్ణకుమారి, శ్రీనివాస్‌గౌడ్, కషాన, శేషమనిసింగ్, వీరాంజనేయులు, నరేష్ ఉన్నారు.

నిరుపేదలకు అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న రాహుల్ నాయక్

కుల్కచర్ల: నిరుపేదలకు తాము అండగా ఉంటామని అఖిల భారత బంజార సేవా సమితి తాలుకా అధ్యక్షుడు రాహుల్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని హన్మునాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలో నేనావత్ లక్ష్మి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన ఆయన బాధిత మహిళకు రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నా తండ్రి రవీందర్‌నాయక్ ఆశయాలకు అనుగుణంగా తన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని చెప్పారు. పేదలకు మేలు చేయడమే తన అభిమతమని అన్నారు. ఏబీబీఎస్ సంఘం నిర్విరామంగా పేదల కోసం పని చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే గ్యారంటీలు

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిరుపేదలకు అందాల్సిన పథకాలను నాయకులే మింగేశారని పరిగి కాంగ్రెస్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో ఇంటింటికి తిరిగి ఆరు గ్యారంటీలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని వ్యాఖ్యనించారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాల్లో అవకతవకలు జరిగాయని, ప్రజలకు అందకుండా నాయకులే కాజేశారని ఆరోపించారు. కేసీఆర్ ఇప్పటి వరకు రుణామాఫీ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పథకాలు ఆగిపోతాయని బీఆర్‌ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తుందని చెప్పారు. ఏ పథకం ఆగిపోదని మెరుగుగా అమలు చేస్తామన్నారు.. పేద సంక్షేమానికి పని చేసే పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని వివరించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు పల్లికృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పరశురాంరెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



పరిగి: గ్యారంటీ కార్డు ఇస్తూ ప్రచారం చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

కాంగ్రెస్ గెలిస్తే ప్రతి ఇంట్లో వెలుగులు

వికారాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే ప్రతి ఇంట్లో వెలుగులు నిండుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 18,19వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలు పూర్తిస్థాయిలో అమలవుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే తప్పకుండా అమలు చేస్తుందనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, కౌన్సిలర్లు దేవి, మురళి, వేణుగోపాల్ రెడ్డి, చందర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అనూహ్య స్పందన

మర్పల్లి: గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి అనూహ్య స్పందన లభిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నర్సాపూర్ చిన్న, పెద్ద తండాల్లో, తుమ్మలపల్లి, దార్గులపల్లి, బిల్‌కల్ గ్రామాల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెం సుభాష్‌యాదవ్‌తో కలిసి ఆయన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ఆరు గ్యారంటీ పథకాలతో లబ్ధి జరుగుతుందని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేసి అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రసిడెంట్ సురేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి సంజీవరెడ్డి, నియోజకవర్గం సీనియర్ నాయకులు దివాకర్, పట్లూర్ ఎంపీటీసీ సురేష్, మర్పల్లి మాజీ ఎంపీటీసీ శేఖర్, మర్పల్లి మాజీ సర్పంచ్ పాండునాయక్ ఆయా గ్రామాల పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఉన్నారు.



మర్పల్లి: వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

స్థానికేతరులను చిత్తుగా ఓడించాలి

- ఏం చేశావని ఓట్లు అడుగుతున్నావ్
- మనోహర్‌రెడ్డికి ఓట్లడిగే అర్హతలేదు
- ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి



బషీరాబాద్: మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

బషీరాబాద్: పారాచూట్ వేసుకొని కాంగ్రెస్ అభ్యర్థిగా దిగిన మనోహర్‌రెడ్డి పాచికలు తాండూరులో చెల్లవని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. తాండూరులో ఎన్ని ఊర్లు ఉన్నాయో తెలియని వ్యక్తి ఓట్లు అడగడానికి వస్తే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా శనివారం బషీరాబాద్ మండలం కొత్లాపూర్, నంద్యానాయక్‌తండా, దామర్‌చెడ్, జమ్లానాయక్‌తండా, అల్లాపూర్, మాసన్‌పల్లి, కొర్విచెడ్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. పొరపాటున కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా ఆగిపోతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి(రాజు), పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

రోహిత్‌రెడ్డినే గెలిపించుకుందాం

పెద్దేముల్: రోహిత్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని మండల రెగోండి సర్పంచ్ హైదర్ అన్నారు. శనివారం రెగోండి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. ఊళ్ళు తెలియని కాంగ్రెస్ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. 40 ఏళ్ల పాలనలో జరగని అభివృద్ధి ఐదేళ్ల పాలనలో చేసిన ఘనత రోహిత్‌రెడ్డికి దక్కిదన్నారు. ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి రెండవ సారి ఎమ్మెల్యే కావడం ఖాయమన్నారు.

తండాల అభివృద్ధి ఘనత బీఆర్‌ఎస్‌దే

యాలాల: గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కిందని సర్పంచ్‌ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి, బషీర్‌మియాతండా సర్పంచ్ మిత్రునాయక్ అన్నారు. శనివారం మండలంలోని దేవనూరు అనుబంధ దుబ్బలతండా, దేవులాతండాల్లో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కోట్ల రూపాయాలతో తీసుకొచ్చి పంచాయతీలను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అభివృద్ధి చేసి చూపెట్టారన్నారు. మరోమారు రోహిత్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

పెద్దేముల్: మండలంలోని గాజీపూర్‌లో శనివారం సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. గ్రామంలో మూడురోజుల పాటు శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం పెద్ద ఎత్తున వేద పండితుల మంత్రోచరణల మధ్య నిర్వహించారు. శనివారం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద జరిగిన సీతారాముల కల్యాణంలో మంతటి నరేష్-రేణుక, హరీశ్వరెడ్డి-సంధ్య దంపతులు, గ్రామ పెద్దలు కల్యాణంలో పాల్గొన్నారు. 16న గోపూజ, గణపతి పూజ, అఖండ దీపారాధన, శిఖరోహణం, ధ్వజరోహణం, 17న వేదస్వస్తి అవాహిత దేవతల పూజలు, నవగ్రహ వాస్తు హోమం, రుద్రహోమం, 18న చివరి రోజు శనివారం గరుడ స్తంభ పునః ప్రతిష్ఠాపన, స్థాపిత దేవత హోమం, ప్రధాన దేవతల పునః ప్రతిష్ఠాపన, పూర్ణహుతి, కుంభాభిషేకం, అర్చన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.



సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

ఎన్నికల వేళ.. ఉరుకులు, పరుగులు

అసంపూర్తి వంతెన నిర్మాణ పనుల ముమ్మరం

ధారూరు: మండలంలోని స్టేషన్ ధారూరు-దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నానదిపై నిర్మిస్తున్న అసంపూర్తిగా వదిలేసిన వంతెన నిర్మాణ పనులు శనివారం శరవేగంగా మొదలు పెట్టారు. ఆరేళ్లైన పూర్తికాని పనులు 6 నెలల్లో పూర్తి చేస్తామని ప్రకటించిన ప్రజాప్రతినిధులు ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోలేదు. ఈ వంతెన నిర్మాణ పనులు చేపట్టిన ఇద్దరు కాంట్రాక్టర్లు ఓ బడా ప్రతినిధి అడిగినంత పర్సెంటేజీ డబ్బులు ఇవ్వలేక పనులను వదిలిపెట్టి పారిపోయారు. ముచ్చటగా మూడో కాంట్రాక్టర్ వచ్చినా పనుల్లో జాప్యం చేస్తూ వచ్చారు. ఈ నెల 30న ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కాంట్రాక్టర్ పనులను ముమ్మరం చేశారు. కాగ్నానదిపై వేసిన పిల్లర్లకు రెండు చివరి వైపుల నాలుగు చొప్పున గట్టర్లు అమర్చారు. మధ్యలో గట్టర్లు అమర్చే ప్రయత్నంలో 27.50 టన్నుల బరువు ఉన్న ఓ గట్టర్ పై నుంచి కింద పడుతూ లారీని ధ్వంసం చేసింది. దీంతో పనులు మళ్లీ ఆగిపోయాయి. మరో లారీని ఆదివారం తీసుకువచ్చి గట్టర్లను అమర్చే పనులు పూర్తి చేస్తామని సంబంధిత కాంట్రాక్టర్ చెప్పారు. పనుల్లో భాగంగా కాగ్నానదిపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డును వెడల్పు చేశారు. దీంతో ప్రజలు, వాహనదారుల రాకపోకలకు సౌకర్యవంతంగా ఏర్పడింది. పనులు సవ్యంగా సాగితే రెండు నెలల్లో పూర్తిచేసి వంతెన పైనుంచి రాకపోకలు కొనసాగేలా చేస్తామని సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారి ఒకరు తెలిపారు.



లారీలో పెట్టడానికి గట్టర్‌ను పైకి లేపుతున్న క్రేన్లు

ఆటోను ఢీకొట్టిన బైక్

ఆరుగురికి గాయాలు

ధారూరు: ఆటోను బైక్ ఢీకొట్టిన ఘటనలో ఆరుగురికి గాయాలైన ఘటన ధారూరు మండల కేంద్రంలోని కోట్‌పల్లి చౌరస్తా సమీప పెట్రోల్‌బంక్ వద్ద శనివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. పెద్దేముల్ మండలంలోని మదనంతాపూర్ తండా నుంచి ఆటోలో కొంతమంది మహిళలు ధారూరు కూరగాయల సంతకు వస్తున్నారు. ఆటో పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే బంక్‌లో పెట్రోల్ పోయించుకుని వస్తున్న బైక్‌కు ఆటోను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న గట్టిపల్లి గ్రామానికి చెందిన నారాయణరావుకు స్వల్ప గాయాలు కాగా వెనుక కూర్చున్న రాంపూర్‌తండాకు చెందిన బిక్యానాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ఉన్న మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



తీవ్రంగా గాయపడిన బిక్యానాయక్

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లో చేరికలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మహేశ్‌రెడ్డి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

దోమ : సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసే ఇతర పార్టీల కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో భారీగా చేరుతున్నారని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలం లోని రాకొండ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు వేసి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా తీర్చిదిద్దాడని అన్నారు. ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకువచ్చి తెలంగాణ ప్రజలకు సమర్థవంతమైన పాలనను అందిస్తున్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలెవ్వరూ కాంగ్రెస్, బీజేపీలను నమ్మడం లేదన్నారు. బోగస్ మాటలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీలు గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారని, వారి మాటలను ప్రజలు నమ్మె పరిస్థితిలో లేరన్నారు. కారు గుర్తు ఓటు వేసి భారీ మెజార్టీతో తన గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ చాపల వెంకటమ్మ, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మశ్చేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ల సీజ్

బషీరాబాద్: మండలంలోని దామర్‌చెడ్ గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శాంత్‌కుమార్, సురేష్ అనే వ్యక్తులు శనివారం ఎక్మాయి మోదుగు వాడుకా నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తుంటే పట్టుకున్నామని చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.



పోలీసు స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

వనరులను దోచుకున్న రోహిత్‌రెడ్డి



తాండూరు టౌన్: బజ్జీలు వేస్తూ ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్ రెడ్డి



రెడ్డిఘనాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎంపీపీ కరుణ

- నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం
- ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్ : తాండూరు పరిధిలోని సహజ వనరులను ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి దోచుకుంటున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్ రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా తాండూరు పట్టణంలోని సాయిపూర్, తాతగుడి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆరు గ్యారంటీ స్కీంలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాండూరు ప్రాంతం విలువైన సహజ వనరులకు నిలయమని, అలాంటి వనరులను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఆయన అనుచరులు కొల్లగొట్టారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నాయకులు భూకబ్జాలకు పాల్పడ్డారని, గెలిచిన తర్వాత ఎవరినీ వదిలేది లేదని వ్యాఖ్యనించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులు శూన్యమని, గతంలో నిధులు మంజూరై ప్రస్తుతం పూర్తయిన పనులను తానే చేయించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సాధారణ కార్యకర్తను ప్రధానిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి మాత్రమే దక్కిందన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తామని తెలిపారు. హస్తం గుర్తుకే ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించండి

పెద్దేముల్: అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తాండూరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దేముల్ మండల హన్మాపూర్‌లో బీజేపీ బూత్ ప్రెసిడెంట్ లోంక మహిపాల్‌తో పాటు మరికొంత మంది బీఆర్‌ఎస్ పార్టీలో రోహిత్‌రెడ్డి సమక్షంలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. ఏ గ్రామానికి వెళ్లిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు వెంకట్, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రమాకాంత్, అఖిల్, ప్రభు, ప్రవీణ్, శ్రీనుతో పాటు పాల్గొన్నారు.

అవ్వా.. మనోహర్‌రెడ్డికి ఓటేయండి

పెద్దేముల్: తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం పెద్దేముల్ మండల మాజీ ఎంపీపీ వాణిశ్రీ గ్రామగ్రామాల తిరుగుతూ మనోహర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతోంది. అవ్వ.. తాతలను కలిసి మనోహర్‌రెడ్డికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తుంది.

మనోహర్‌రెడ్డిని ఆశీర్వదించండి: ఎంపీపీ

బషీరాబాద్: కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ కరుణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం రెడ్డిఘనాపూర్‌లో ఆమె స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంక్షేమంతో పాటు మహిళలకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. మహిళలకు ప్రతి నెలా రూ.2500 వస్తాయని, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తుందన్నారు. డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీధర్, సర్పంచులు ప్రియాంక, పద్మ, సునీత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

కుల్కచర్ల: వర్షాకాల పంటల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మండల వ్యవసాయాధికారి వీరస్వామి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..కుల్కచర్లలో 2 సెంటర్లు, బండవెల్కిచర్ల, సాల్వీడు, ముజాహిద్‌పూర్‌లో 2 సెంటర్లు, అంతారం, తిర్మలాపూర్, కుస్మసముద్రం, చౌడాపూర్ మండల పరిధిలో చౌడాపూర్, చాకల్‌పల్లి, కల్మన్‌కాల్వ, మల్కాపూర్, మరికల్, కొత్తపల్లి, అడవివెంకటాపూర్, వీరాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

గుండెపోటుతో ఎంపీఓ పాండునాయక్ మృతి



(ఫైల్)

బొంరాస్‌పేట: గుండెపోటుతో ఎంపీఓ పాండునాయక్(52) మృతి చెందారు. గత ఎనిమిదేళ్లగా విధులు నిర్వహిస్తున్న ఎంపీఓ పాండునాయక్ ఇన్‌చార్జిగా ఎంపీడీఓగా ఉన్నారు. శనివారం ఉదయం అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించారు. దీంతో సిబ్బంది మండల కార్యాలయం ఎదుట ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పాండునాయక్ స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలానికి చెందిన వారుగా తెలిపారు.

పకడ్బందీగా భద్రత్రా ఏర్పాట్లు

అనంతగిరి: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేయాలని అసెంబ్లీ ఎన్నికల జిల్లా పోలీస్ అబ్జర్వర్ డీఐజీ ఠాగూర్ తాప అన్నారు. ఈ మేరకు శనివారం వికారాబాద్‌లోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా మరిన్ని పోలీసు బలగాలు ఎన్నికల దృష్ట్యా జిల్లాకు రావడం జరుగుతుందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌తో కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. సీవిజిల్‌లో వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. పక్కగా వాహనాల తనిఖీ చేయాలని, కమాండ్ కంట్రోల్‌తో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పోలింగ్ స్టేషన్, రూట్ మొబైల్‌లు, సున్నితమైన గ్రామాలపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు.ఎస్పీ కోటిరెడ్డి, డీఎస్పీలు నర్సింలు, శేఖర్‌గౌడ్, కరుణాసాగర్ రెడ్డి, జానయ్య, సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పోలీస్ అబ్జర్వర్ ఠాగూర్

యూత్ డిక్లరేషన్ విడుదల

తాండూరు టౌన్ : 'తాండూరు ప్రశ్నించు...ప్రగతిని సాధించు' అనే నినాదంతో తాండూరుకు చెందిన పలువురు యువత యూత్ డిక్లరేషన్‌ను శనివారం విడుదల చేశారు. తాండూరు ప్రాంతం సహజ వనరులతో విరాజిల్లుతోందని, రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూర్చే ప్రాంతంగా ఉన్నప్పటికీ అభివృద్ధిలో వెనుకబడిందని ఆరోపంచారు. తాండూరులో మెడికల్ కళాశాల లేదా యూనివర్సిటీ, పీజీ స్టడీ సెంటర్, ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఆసుపత్రిలో సేవల పెంపుతో పాటు, స్పెషలిస్టు వైద్యులను అందుబాటులో పెట్టాలన్నారు. ఫ్యాక్టరీలలో స్థానిక యువతకు ఉద్యోగాలు, సీఎస్ఆర్ ఫండ్ ద్వారా తాండూరు అభివృద్ధి, కాలుష్య నివారణ చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో మినీ స్టేడియం ఏర్పాటు, ఆడిటోరియం, ప్రెస్ క్లబ్ నిర్మాణం చేపట్టాలన్నారు. కందిబోర్డు ఏర్పాటు, మైనింగ్ కళాశాల, పాత తాండూరు రైల్వే వంతెన, మినీ ట్యాంక్ బండ్, శ్మశాన వాటికలకు స్థలం, పార్కుల అభివృద్ధి వంటి పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. తాండూరు నియోజకవర్గ బరిలో ఉన్న 21 మంది అభ్యర్థులకు ఈ డిక్లరేషన్ వర్తిస్తుందని, గెలిచిన అభ్యర్థి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పర్యాద రామకృష్ణ, జుంటుపల్లి వెంకట్, సంగిశెట్టి అభిషేక్, విజయ్‌భాస్కర్, రాజేష్, ముకేష్, శివ, సాయిప్రసాద్, నరేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



డిక్లరేషన్‌ను ప్రకటిస్తున్న యువకులు